




గద్దర్‌కు సైకత నివాళి

ప్రజా గాయకుడు గద్దర్‌కు సైకత శిల్పి గేదెల హరికృష్ణ సైకత నివాళి అర్పించారు. మండలంలోని గాజులకొల్లివలస వద్ద ఉన్న సంగమేశ్వర స్వామి ఆలయం కొండ దిగువన గద్దర్ సైకత శిల్పాన్ని చెక్కారు. సైకత శిల్పాన్ని చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వచ్చి ఆసక్తిగా తిలకించారు.

– ప్రజాశక్తి, ఆమదాలవలస

మున్సిపల్ కార్మికుల ముట్టడి

- కార్మికులను అడ్డుకున్న పోలీసులు
- 101 మంది కార్మికులు అరెస్టు, విడుదల

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని, ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు అమలు చేయాలని తదితర డిమాండ్లతో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యాన మున్సిపల్ కార్మికులు కలెక్టరేట్‌ను సోమవారం ముట్టడించారు. నగరంలోని హౌసింగ్‌బోర్డు కాలనీ నుంచి కలెక్టరేట్ వరకు కార్మికులు ప్రదర్శనగా తరలివచ్చారు. కలెక్టర్‌కు సమస్యలు విన్నవించుకుంటామని కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులను ప్రతిఘటిస్తూ ముందుకెళ్లేందుకు కార్మికులు ప్రయత్నించడంతో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.బలరాం, జిల్లా ఉపాధ్యక్షులు ఎ.గణేష్, కోశాధికారి టి.సంతోష్‌తో పాటు 101 మందిని అరెస్టు చేసి ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై వారిని విడుదల చేశారు.

15 నుంచి నిరవధిక సమ్మెకు సిద్ధం

మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులందరినీ వెంటనే పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, క్లాప్ డ్రైవర్లకు రూ.18,500 వేతనం ఇవ్వాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.బలరాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అరెస్టులకు ముందు కార్మికులనుద్దేశించి వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలన్నారు. ఇంజినీరింగ్ కార్మికులకు రిస్కు, హెల్త్ అలవెన్స్, విలీన పంచాయతీ కార్మికులకు హెల్త్ అలవెన్సు, పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని డిమాండ్ చేశారు.



కార్మికులను అడ్డుకుంటున్న పోలీసులు

మాట తప్పను మడమ తిప్పనని చెప్పుకునే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఒట్టేసి గెలిపించిన మున్సిపల్ కార్మికులను నట్టేట ముంచారని విమర్శించారు. కాంట్రాక్ట్ కార్మికులను ఆప్కాస్‌లో చేర్చి శాశ్వత బానిసలను చేశారన్నారు. దళారీ వ్యవస్థ ద్వారా క్లాప్ డ్రైవర్లను నియమించి కనీస వేతనాలు అమలు చేయడం లేదన్నారు. ఇచ్చిన ఎన్నికల హామీలు అమలుకు ఉద్యమిస్తున్న కార్మికులను పోలీసు నిర్బంధంతో అణచివేయాలని ప్రయత్నించడం అన్యాయమన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే ఈనెల 15 నుంచి నిరవధిక సమ్మె చేయడానికి కార్మికులంతా సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు కళ్యాణ రాజు, ఎన్.రమేష్, ఎ.రాము, రాజేష్, శేఖర్, డి.చిట్టిబాబు, ఆకుల మోహన్, ఎ.జగన్, గురుస్వామి, పార్వతి, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.



రాట్నం వడుకుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

చేనేతలో జిల్లాకు ప్రత్యేక గుర్తింపు

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

దేశంలో వ్యవసాయరంగం తర్వాత అతి పెద్ద రంగం చేనేత అని, అటువంటి రంగాన్ని మరింత అభివృద్ధి చేయాల్సి ఉందని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. చేనేత రంగంలో జిల్లా వస్త్రాలకు ప్రపంచ ఖ్యాతి ఉందని గుర్తుచేశారు. చేనేత జౌళి శాఖ, చిక్కోలు వీవర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ సంయుక్తంగా నగరంలోని బాపూజీ కళామందిరంలో 9వ జాతీయ చేనేత దినోత్సవ వేడుకలను సోమవారం నిర్వహించారు. ముందుగా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మంగళగిరి, వెంకటగిరి, పోచంపల్లి తరహాలోనే పొందూరు ఖద్దరుకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ఇది మరింత ఉన్నతికి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. మిల్లు వస్త్రాల వాడకాన్ని తగ్గించుకుని చేనేత వస్త్రాల వినియోగాన్ని పెంచాలన్నారు. చేనేత కార్మికులను ప్రభుత్వం నేతన్న నేస్తం పథకంతో పాటు అనేక సంక్షేమ పథకాలను అందిస్తోందని, ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లాలో 3,850 మంది చేనేత కార్మికులకు పెన్షన్ అందిస్తున్నామన్నారు. 2019లో కేంద్ర, రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రులు పొందూరును సందర్శించి చేనేత రంగానికి మరింత ప్రోత్సాహాన్ని అందిస్తామని హామీనిచ్చారని గుర్తుచేశారు. జిల్లాలోని అధికారులంతా ప్రతి నెల మొదటి సోమవారం చేనేత వస్త్రాలను ధరించేలా ఆదేశాలు ఇచ్చామన్నారు. తన తండ్రి కూడా చేనేత రంగంలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందారని, చేనేత రంగమే తమ కుటుంబాన్ని ఆదుకుందని కలెక్టర్ గుర్తు చేసుకున్నారు. డాక్టర్ సంపతిరావు శ్రీదేవి మాట్లాడుతూ హైదరాబాద్‌లో నిర్వహించనున్న గైనిక్ కాన్ఫరెన్స్‌లో శ్రీకాకుళం నుంచి చేనేత వస్త్రాల ప్రదర్శన ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఆర్ట్ సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో నాబార్డు ఎజిఎం వరప్రసాద్ కుమార్, ఇంటాక్ కన్వీనర్ నూక సన్యాసిరావు, రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు, చేనేత జౌళి శాఖ ఎడి బి.ధర్మారావు, ఎడిఒ శేఖర్, ఆప్కో డివిజనల్ మార్కెటింగ్ మేనేజర్ సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ రామ్మోహన్ నాయుడు

'సౌదీ'లో చిక్కుకున్న వారిని రప్పించాలి

విదేశాంగ మంత్రికి ఎంపీ వినతి

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

పొట్ట కూటి కోసం సౌదీ అరేబియాకు వలస వెళ్లిన శ్రీకాకుళం జిల్లాకు చెందిన వలస కార్మికులను వెంటనే స్వదేశానికి రప్పించేలా చర్యలు తీసుకుకోవాలని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. ఢిల్లీలో విదేశీ వ్యవహారాలశాఖ మంత్రి జైశంకర్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. వజ్రపుకొత్తూరు మండలానికి చెందిన 20 మంది ఏడాది కిందట సౌదీ అరేబియాలోని ఒక ప్రయివేట్ పరిశ్రమలో ఉద్యోగాల కోసం వలస వెళ్లారని చెప్పారు. సంబంధిత యాజమాన్యం కేవలం నాలుగు నెలలు మాత్రమే జీతాలు చెల్లించిందని, దీంతో వారంతా పస్తులు ఉండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని వివరించారు. వారిని ఉద్యోగాల కోసం తీసుకువెళ్లిన కాంట్రాక్టర్‌ను అడిగినా పట్టించుకోవడం లేదని తెలిపారు. వీసా గడువు సైతం ముగియడంతో 14 మంది పస్తులతో అక్కడే బిక్కుబిక్కుమంటూ గదుల్లో కాలం గడుపుతున్నారంటూ కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి జైశంకర్ తక్షణ చర్యలకు అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని హామీనిచ్చారు.



దీక్షలో కూర్చొన్న విఆర్‌ఎలు

విఆర్‌ఎల 36 గంటల నిరసన దీక్ష

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్త ఆందోళనలో భాగంగా ఎపి గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం ఆధ్వర్యాన విఆర్‌ఎలు కలెక్టరేట్ సమీపాన జ్యోతిరావుపూలే పార్కు వద్ద 36 గంటల నిరసన దీక్షను సోమవారం చేపట్టారు. దీక్షను సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎ.సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో కీలకపాత్ర పోషిస్తున్న విఆర్‌ఎల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తోందని విమర్శించారు. నిబంధనలకు విరుద్ధంగా విఆర్‌ఎలకు గతంలో చెల్లించిన డిఎలను రికవరీ చేయడం అన్యాయమన్నారు. అరకొర జీతం తీసుకుంటున్న విఆర్‌ఎల జీతం నుంచి డిఎ మొత్తాన్ని ప్రతినెలా రికవరీ చేస్తున్నారని, దీనివల్ల జీతాలు సరిపోక అవస్థలు పడుతున్నారని చెప్పారు.

రికవరీ చేసిన మొత్తాలను తిరిగి విఆర్‌ఎలకు చెల్లించాలని కోరారు. నామినీలను విఆర్‌ఎలుగా గుర్తించాలని, ఉద్యోగోన్నతుల్లో 30 శాతం వాటా ఇచ్చి అర్హత గల వారికి విఆర్‌ఒలుగా నియమించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలు నాలుగేళ్లలో ఒక్కటీ పరిష్కరించలేదన్నారు. విఆర్‌ఎలను పూర్తిస్థాయి ఉద్యోగులుగా పని చేయించుకుంటున్నారని, పనికి తగిన వేతనం ఇవ్వడం లేదన్నారు. దీక్షలో యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సూర్యనారాయణ, టి.త్రినాథరావు, సీతప్పడు, రమణ, మల్లేశ్వరరావు, రాజశేఖర్, అప్పారావు తదితరులు కూర్చొన్నారు.

చంద్రబాబు పర్యటనకు బందోబస్తు

ఏర్పాట్లను పరిశీలించిన ఎస్‌పి

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఈనెల పదో తేదీన జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను ఎస్‌పి జి.ఆర్ రాధిక సోమవారం పరిశీలించారు. జిల్లా పర్యటనలో భాగంగా చంద్రబాబు హిరమండలంలోని వంశధార రిజర్వాయర్‌ను పరిశీలించిన అనంతరం కొత్తూరులో నిర్వహించనున్న బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. దీంతో వంశధార రిజర్వాయర్ ప్రాంతంతో పాటు బహిరంగ సభ వేదికను ఎస్‌పి పరిశీలించారు.



వంశధార రిజర్వాయర్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్‌పి రాధిక

భూ హక్కుతో భూ వివాదాలకు చెక్

రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

సమగ్ర సర్వేతో భూ హక్కు కల్పించడం ద్వారా భూ వివాదాలకు చెక్ పడుతుందని రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. మండలంలోని పొల్లాడ నుంచి దబ్బలపాడు వరకు ఎఐబి-1బి నిధులు రూ.34.50 లక్షలతో నిర్మించనున్న 1.4 కిలోమీటర్ల రహదారి పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. అనంతరం జగనన్న శాశ్వత భూ హక్కు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ హక్కు పత్రాల ద్వారా బ్యాంకులో రుణం పొందడానికి అవకాశం కలుగుతుందన్నారు. నాలుగేళ్లుగా శివారు భూములకు వంశధార నీరు అందడం లేదని, దీనిపై దృష్టిసారించాలని సర్పంచ్ అట్టాడ గోపి మంత్రిని కోరారు. కార్యక్రమంలో జిల్లాపరిషత్ వైస్ చైర్‌పర్సన్ ప్రతినిధి పి.శ్రీనివాసరావు, జిల్లా ప్రణాళిక సంఘం మాజీ సభ్యుడు హనుమంతు వెంకటరావుదొర, ఎంపిపి ప్రతినిధి ఉప్పరపల్లి ఉదయ్ కుమార్, సైలాడ ఎంపిటిసి పిన్నింటి జయరాం, మాకయ్య, డిఎల్‌పిఒ ఐ.వి రమణ, ఎంపిడిఒ సిహెచ్.ఈశ్వరమ్మ, డిటి వి.గిరిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులు, వృద్ధులకు ఉపకరణాలు

ఎంపీ లేఖతో స్పందించిన కేంద్రమంత్రిత్వ శాఖ

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

వికలాంగులు, వయోవృద్ధులకు ఉపకరణాల పంపిణీ గుర్తింపునకు అధికార యంత్రాంగం ప్రత్యేక శిబిరాల ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. వికలాంగులు, వృద్ధులకు బహుళ ప్రయోజనాలు కల్పించే పరికరాలను అందించాల్సిన అవసరాన్ని తెలియజేస్తూ ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు గతేడాది జనవరి, ఏప్రిల్, జూలైలో సంబంధిత కేంద్ర మంత్రిత్వశాఖకు లేఖ రాశారు. దీని ప్రాధాన్యతను గుర్తించిన సంబంధిత కేంద్రమంత్రి జిల్లాలో కొత్తగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు. దీనిపై కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ప్రత్యేక శిబిరాల ఏర్పాటు షెడ్యూల్‌ను విడుదల చేశారు. శ్రీకాకుళం, నరసన్నపేట నియోజకవర్గాలకు సంబంధించి ఎనిమిదో తేదీన శ్రీకాకుళంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో శిబిరం నిర్వహించనున్నారు. తొమ్మిదో తేదీన ఆమదాలవలస, ఎచ్చెర్ల నియోజకవర్గాలకు ఆమదాలవలసలోని ఎఎంసి యార్డ్‌లో, పదో తేదీన పాతపట్నం, టెక్కలి నియోజకవర్గాలకు పాతపట్నంలోని ఎంఎంసి యార్డ్‌లో క్యాంపు నిర్వహించనున్నారు. 11న ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాలకు పలాస ఎంపిడిఒ కార్యాలయంలో శిబిరం నిర్వహించనున్నారు. 2020 ఫిబ్రవరిలో ప్రముఖ కృత్రిమ అవయాల తయారీ కేంద్రం (ఎఎల్ఐఎంసిఒ) గుర్తింపు కార్యక్రమం చేపట్టిన సందర్భంగా జిల్లాలో 4,247 మందిని గుర్తించారు. పరికరాల పంపిణీకి సుమారు రూ.2.9 కోట్లు ఖర్చు కాగా నిధులు చాలకపోవడంతో, ఎంపీ రామ్మోహన్ నాయుడు తన ఎంపీ ల్యాడ్స్ నిధుల నుంచి రూ.30.60 లక్షలను అందించారు. తద్వారా 255 మందికి అదనంగా పరికరాలు, వాహనాలను సమకూర్చగలిగారు. త్వరలో నిర్వహించనున్న శిబిరాలతో వేలాది మంది ప్రయోజనం కలగనుంది. ప్రత్యేక శిబిరాల్లో గుర్తించిన వారికి వారి అవసరాలను బట్టి ఎఎల్ఐఎంసిఒ మూడు చక్రాల సైకిల్, రెండు చక్రాల తోపుడు కుర్చీ, చంక కర్రలు, కాలిపర్స్, కృత్రిమ అవయవాలు అందించనున్నారు.

పోర్టు ఆర్ అండ్ ఆర్ కాలనీకి శంకుస్థాపన

బహిష్కరించిన నిర్వాసితులు

ప్రజాశక్తి - నౌపడ

మూలపేట అదానీ పోర్టు నిర్వాసితులకు నౌపడలో నిర్మించనున్న ఆర్ అండ్ ఆర్ కాలనీకి ఎపి మారిటైమ్ బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి నేతృత్వాన టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి సోమవారం భూమి పూజ చేశారు. నౌపడలోని పలువురు రైతుల వద్ద 55 ఎకరాలు సేకరించి రూ.35 కోట్లతో కాలనీ నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కాలనీకి ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, వైసిపి టెక్కలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి దువ్వాడ వాణి సోమవారం ఉదయం పది గంటలకు భూమి పూజ చేయనున్నట్లు ప్రకటించారు. శంకుస్థాపనకు వారిద్దరూ గైర్హాజరయ్యారు. స్థానిక నాయకులు, నిర్వాసితులు హాజరు కాకపోవడంతో టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి భూమి పూజ చేసి వెళ్లిపోయారు.

బహిష్కరించిన నిర్వాసితులు

నౌపడలో ఆర్ అండ్ ఆర్ కాలనీ శంకుస్థాపనకు హాజరు కావాలని మూలపేట, విష్ణుచక్రంలో ఆదివారం దండోరా వేయించారు. నిర్వాసితులు శంకుస్థాపనకు రప్పించేందుకు ఏర్పాట్లు చేశారు. శంకుస్థాపన అనంతరం అండ్ ఆర్ కాలనీ వద్ద నిర్వాసితులతో మాట్లాడేందుకు అధికారులు సమావేశం ఏర్పాటు చేశారు. మూలపేట సర్పంచ్ జీరు బాబూరావుకు శంకుస్థాపన సమాచారం ఇవ్వకపోవడంతో... స్థానిక నాయకులు, నిర్వాసితులు సమావేశానికి హాజరు కాలేదు. కనీసం ఆర్ అండ్ ఆర్ కాలనీకి భూములు ఇచ్చిన నౌపడ రైతులకు, ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వలేదు. దీంతో నౌపడలో ఏర్పాటు చేసిన సభా ప్రాంగణం ఖాళీ కుర్చీలతో దర్శనమిచ్చాయి. రెండు గంటల పైగా వేచి ఉన్న అధికారులు ప్రజలు రాకపోవడంతో శంకుస్థాపన చేసి వెళ్లిపోయారు.



భూమి పూజ చేస్తున్న సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

నిర్వాసితుల సమస్యలపై నిర్లక్ష్యం

2013 చట్టాన్ని అమలు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - కొత్తూరు

వంశధార నిర్వాసితుల సమస్యలను పరిష్కరించకుంటే ప్రజల మద్దతుతో పోరాటాలను ఉధృతం చేస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.సింహాచలం ప్రభుత్వాన్ని హెచ్చరించారు. జిల్లాను సస్యశ్యామలం చేయడం కోసం సర్వం త్యాగం చేసిన వంశధార నిర్వాసితులకు రాష్ట్ర ప్రభుత్వం 2013 భూసేకరణ చట్టం ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. కొత్తూరులో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సిర్ల ప్రసాద్ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. వంశధార నిర్మాణం కోసం 19 గ్రామాల్లోని 7,574 కుటుంబాలు పది వేల ఎకరాలతో పాటు తమ సర్వస్వాన్ని త్యాగం చేసి జిల్లా అభివృద్ధికి తోడ్పడ్డారని గుర్తుచేశారు. ఎకరా భూమికి రూ.1.50 లక్షలు ప్రభుత్వం చెల్లించడంతో నిర్వాసితులు తీవ్ర అన్యాయానికి గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. గత టిడిపి, ఇప్పుడు వైసిపి ప్రభుత్వాలు 2013 భూసేకరణ చట్టం అమలు చేయకుండా నిర్వాసితులను మోసం చేస్తున్నాయని విమర్శించారు. నిర్వాసితుల కుటుంబాలకు ఇల్లు కట్టుకోవడానికి ఐదు సెంట్ల స్థలం ఇవ్వాల్సి ఉన్నా, వంద కుటుంబాలకు రెండు సెంట్ల స్థలం మాత్రమే ఇచ్చి ప్రభుత్వం చేతులు దులుపుకుందన్నారు. డి-పట్టా భూమికి నేటికీ డబ్బులు చెల్లించకపోవడం దుర్మార్గమన్నారు. ప్రతిపక్ష నేతగా జగన్ నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం అమలు చేస్తామని హామీనిచ్చి, ఇప్పుడు అదనపు పరిహారంతో సరిపెట్టారని విమర్శించారు. చాలామందికి అదనపు పరిహారం చెల్లించలేదన్నారు. సమావేశంలో నిమ్మక అప్పన్న తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గోవిందరావు

10న డీవార్మింగ్ డే

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఈనెల పదో తేదీన డీవార్మింగ్ డే, 17న మాప్ అప్ డే కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి పి.మురళీకృష్ణ తెలిపారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంపై జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశాన్ని కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని అంగన్వాడీ, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లోని విద్యార్థులకు నులిపురుగుల నిర్మూలన మాత్రలు పక్కాగా వేయించాలన్నారు. ఈ మాత్రలు తీసుకోవడం వల్ల ఎటువంటి దుష్ప్రభావాలు ఉండబోవని, విద్యార్థుల్లో అపోహలను తొలగించాలన్నారు. తద్వారా ప్రతి విద్యార్థి మాత్రలు వేసుకునేందుకు ముందుకొస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎంపిడిఒలు, ఆశావర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, స్వచ్ఛంద సేవా సంస్థలు భాగస్వాములై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. 1 నుంచి రెండేళ్ల వయసున్న వారికి సగం మాత్ర, 3 నుంచి 19 ఏళ్ల విద్యార్థులతో పాటు పాఠశాలలకు వెళ్లని పిల్లలకు అంగన్వాడీ కార్యకర్తల ద్వారా మాత్రలు వేయించాలన్నారు. ప్రతి పాఠశాలలో ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్ధేశించిన ప్రణాళిక ప్రకారం కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. మధ్యాహ్న భోజనం తర్వాత ప్రతి విద్యార్థికి ఒక మాత్రను వైద్యారోగ్య, విద్యా శాఖ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తల సమన్వయంతో నమిలి తినిపించాలని సూచించారు. సమావేశంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి, రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం జిల్లా సమన్వయకర్త సి.పి శ్రీదేవి, జిల్లా మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, డిఆర్‌డిఎ పీడీ డి.వి విద్యాసాగర్, పట్టణ ఆరోగ్య అధికారి డా.జి.వెంకటరావు, ఆర్‌ఐఒ ఎస్.తవిటినాయుడు, జిల్లా వృత్తివిద్యాధికారి కె.ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

సాగుదారులకు పట్టాలు ఇవ్వాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

పాతపట్నం మండలం సీతారాంపల్లెలో వారసత్వంగా జిరాయితీ భూములున్న గ్రామస్తులకు ఇంతవరకు పట్టాలు మంజూరు చేయకపోవడంతో ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం పొందలేకపోతున్నారని, పట్టాలు మంజూరు చేయాలని తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌ను కోరారు. నగరంలోని జెడ్‌పి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి జిల్లావ్యాప్తంగా పలు సమస్యలపై 206 వినతులు వచ్చాయి. సీతారాంపల్లె పర్లాకిమిడి రాజుల సంస్థానం పరిధిలో ఉండేదని, రైతులు ఈభూములను సాగు చేసుకుని రాజులకు కప్పం చెల్లించే వారని చెప్పారు. ఇనాం రద్దయిన తర్వాత సెటిల్‌మెంటు కాకపోవడంతో ఇప్పటికీ పర్లాకిమిడి రాజుల సంస్థానం పరిధిలోనే ఈ భూములు ఉన్నట్టు రికార్డుల్లో చూపుతున్నారని వివరించారు. తక్షణమే నోటిఫికేషన్ ఇచ్చి రైతులకు పూర్తి సాగు హక్కును కల్పిస్తూ హక్కు పత్రాలు ఇవ్వాలని కోరారు. ఎల్ఎన్‌పేట మండలంలో అనేక గ్రామాలకు వంశధార నది నుంచి తాగునీటి సౌకర్యం ఉండేదని, మూడేళ్లుగా ఏ ఒక్క గ్రామానికీ తాగునీటి పథకం ద్వారా నీరందించడం లేదని తురకపేట సర్పంచ్ ఊట సత్యనారాయణ ఫిర్యాదు చేశారు. సోంపేట, మందస మండలాల మధ్య ప్రవహిస్తున్న మహేంద్రతనయ నదిలో ప్రవాహం ఉన్నా రైతులకు సాగునీరు అందడం లేదని, పొంతంగి వద్ద గ్రోయిన్లు పూర్తిగా పాడయ్యాయని ఆ ప్రాంతానికి చెందిన రైతులు కలెక్టర్‌కు మొర పెట్టుకున్నారు. పైడిగాం వద్ద నిర్మించిన ఆనకట్ట శిథిలమైందని చెప్పారు. పొత్తంగి వద్ద ఎత్తిపోతల పథకంతో పాటు ఆనకట్ట, గ్రోయిన్ల మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఆమదాలవలస మండలం దూసి ఆర్ఎస్‌లో ఆర్అండ్‌బి రహదారి పక్కన శిథిల స్థితికి చేరుకున్న బస్‌షెల్టర్‌ను పునర్నిర్మించాలని జనసేన నాయకుడు ఎం.రాజశేఖర్ కోరారు. స్పందనలో వచ్చిన ప్రతి వినతిని సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ మురళీకృష్ణ, డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్, డిఎస్‌ఒ వెంకటరమణ, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కలెక్టర్ జన్మదిన వేడుకలు

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అధికారుల సమక్షంలో కలెక్టర్ కేకు కట్ చేశారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్


మాట్లాడుతున్న అప్పారావు

బదిలీ ఉపాధ్యాయుల జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి- కొత్తూరు

రెండు నెలల క్రితం బదిలీ అయిన ఉపాధ్యాయుల జీతాలను తక్షణమే చెల్లించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పొందూరు అప్పారావు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. మండలంలోని కొత్తూరు, నివగాం, కుంటిభద్ర, మాతల, మెట్టూరు జిల్లా పరిషత్ ఉన్నత, లబ్బ ఆశ్రమ పాఠశాలలను యుటిఎఫ్ బృందం సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు నెలుగా జీతాలు చెల్లించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఒక్క నిముషం ఆలస్యమైనా సిఎల్‌గా పరిగణించడం సరికాదన్నారు. ఉపాధ్యాయులు సమయానికి హాజరైనా సిగ్నల్ లేక ఇబ్బందులు తలెత్తుతున్నాయని అన్నారు. పాఠశాలను విలీనం చేయడం వల్ల ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారిపోయాయని అన్నారు. కార్యక్రమంలో కె.విజయకుమార్, కె.క్రాంతికుమార్, డి.ప్రకాశరావు, ఎం.ప్రసాద్, బి.సంతోష్, పి.అప్పారావు, జి.మాధవరావు పాల్గొన్నారు.


సమస్యలను తెలుసుకుంటున్న ఎస్‌పి రాధిక

ఎస్‌పి 'స్పందన'కు 32 అర్జీలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

'స్పందన'లో వచ్చే అర్జీలను చట్టప్రకారం పరిష్కరించి నిర్ణీత సమయంలోగా బాధితులకు న్యాయం చేయాలని ఎస్‌పి జి.ఆర్.రాధిక పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో వివిధ మండలాల ప్రజల నుంచి వచ్చిన 31 అర్జీలను సోమవారం స్వీకరించారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్జీలను, సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తానని భరోసా ఇచ్చారు. టెలిఫోన్ ద్వారా సంబంధిత అధికారులకు ఫిర్యాదుదారుల వివరాలు, వారి సమస్యలను తెలియపరిచారు. ఫిర్యాదిదారులకు చట్ట పరిధిలో సత్వర న్యాయం అందించాలని సూచించారు. ఫిర్యాదులపై తీసుకున్న చర్యలపై తనకు ఎప్పటికప్పుడు నివేదిక అందించాలని ఆదేశించారు. కుటుంబ తగదాలు 4, పౌర సంబంధాలు 16, పాతవి 3, చీటింగ్ 2, ఇతరులు ఏడు ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో ఆదనపు ఎస్‌పి విఠలేశ్వరరావు, జె.తిపేస్వామి పాల్గొన్నారు.

విఒఎల మూడేళ్ల కాలపరిమితి జిఒను రద్దు చేయాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మహాలక్ష్మి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పరిధిలో పనిచేస్తున్న విఒఎలకు మూడేళ్ల కాలపరిమితిని నిర్ధేశిస్తూ... ప్రభుత్వం ఇచ్చిన జిఒను తక్షణమే రద్దు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అల్లు మహాలక్ష్మి, కార్యదర్శి ఎన్.వి.రమణ, విఒఎల యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.ధనలక్ష్మి జి.అరుణ డిమాండ్ చేశారు. నగరంలోని సిఐటియు కార్యాలయంలో విఒఎల సంఘం జిల్లా కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విఒఎల ఉపాధిని దెబ్బతీసే మూడేళ్ల కాలపరిమితి జిఒను తక్షణమే రద్దు చేయాలన్నారు. సంఘాలను విడగొట్టడం, కలపడం లాంటి నిర్ణయాలు సెర్ప్ అధికారులు చేయడం సరైన విధానం కాదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి నిర్ణయం మానవ వనరుల అభివృద్ధికి విఘాతమే అవుతుందని అన్నారు. ఇప్పటి వరకు 15 సంఘాల లోపు ఉన్న విఒఎలకు వేతనాలు చెల్లించలేదని అన్నారు. ఉపాధి కోల్పోయిన వారందరికీ ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మహిళా మార్టుల్లో బలవంతపు కొనుగోళ్లు, విఒఎలకు ఇచ్చే లక్ష్యాల పద్ధతి ఆపాలని అన్నారు. సమావేశంలో దుర్గ, సీతమ్మ, జగన్, అశిరినాయుడు, లక్ష్మీద్రౌపతి, ప్రభావతి అనురాధ, మోహన్ పాల్గొన్నారు. అనంతరం జిల్లా పరిషత్‌లో నిర్వహించిన స్పందనలో కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌కు వినతిపత్రం అందజేశారు.


మాట్లాడుతున్న మహాలక్ష్మి

రేపు కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకిస్తూ ఈ నెల 9న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించాలని సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు పిలుపునిచ్చారు. నగరంలోని క్రాంతి భవనంలో ఎస్‌కెఎం కన్వీనర్ తాండ్ర ప్రకాష్ అధ్యక్షతన సోమవారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, రైతు సంఘం జిల్లా నాయకులు బాలగ శ్రీరామ్మూర్తి, రైతు కూలీ సంఘం నాయకులు సురేష్, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం.వి.రమణ, జేడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్ సన్నశెట్టి రాజశేఖర్‌లు పాల్గొని మాటాల్డఆరు. క్విట్ ఇండియా రోజైన క్విట్ కార్పొరేట్ ఇండియా పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక, కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలకు ప్రజలంతా సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. ఇందులో భాగంగానే కలెక్టరేట్, మండల తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాల నిర్వహించాలన్నారు. రాష్ట్రపతికి వినతిపత్రాలను అధికారుల ద్వారా అందజేయాలని తీర్మానించారు. ఈ నెల 14న గ్రామ గ్రామాన కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. 15న జాతీయ జెండా ఆవిష్కరణ చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కె.కొండయ్య, చిక్కాల గోవిందరావు, డోల శంకరరావు, అప్పారావు, కె.బాలాజీరావు, తమ్మినేని భాస్కరరావు, టి.నందోడు, బి.రామకృష్ణ, కర్రి సింహాచలం పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మోహనరావు

'సుప్రీం'నిర్ణయం బిజెపికి చెంపపెట్టు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

రాహుల్ గాంధీకి విధించిన శిక్షపై సుప్రీం కోర్టు స్టే విధించడం బిజెపికి చెంపపెట్టని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జాతీయ కన్వీనర్ వాబ యోగి అన్నారు. మోడీపై రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై కింది కోర్టు, హైకోర్టు రెండేళ్ల శిక్ష విధించిన తర్వాత బిజెపి మరింత దుర్మార్గంగా వ్యవహరించిందని మండిపడ్డారు. రాహుల్ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేసిన మోడీ ప్రభుత్వం అంతటి ఆగకుండా ఆయన నివాసాన్ని ఖాళీ చేయించడం బిజెపి అహంకారానికి పరాకాష్ట అని పేర్కొన్నారు. బిజెపి ప్రభుత్వ అహంకారానికి రోజులు దగ్గరపడ్డాయన్నారు.

బురద నీరు సరఫరా

ప్రజాశక్తి- టెక్కలి


సరఫరా అయిన తాగునీరు

టెక్కలి మేజర్ పంచాయతీ పరిధిలోని పలు వీధుల కుళాయి ద్వారా బురదనీరు సోమవారం సరఫరా అయ్యింది. కొద్ది రోజుల నుంచి ఇదే సమస్య ఉన్నా సంబంధిత అధికారులు నీటిని పరిశుభ్రం చేయడంలో ఆలసత్వం ప్రదర్శిస్తున్నారని మహిళలు వాపోయారు. తాగునీటి పథకం శుభ్రం చేయకపోవడంతో ఇలా బురదనీరు వస్తుందని తెలిపారు. తాగునీరు స్వచ్ఛత లేకపోవడంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని అన్నారు. పంచాయతీ అధికారులు స్పందించి స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయాలని కోరుతున్నారు.

చంద్రబాబువి దిగజారుడు రాజకీయాలు

ప్రజాశక్తి- నరసన్నపేట

చిత్తూరులో పోలీసులపై టిడిపి నాయకుల దాడి అత్యంత హేయమైనదని, రాజకీయ లబ్ధి కోసం చంద్రబాబు ఎంతటి నీచానికైనా దిగజారుతారనడానికి ఇదే నిదర్శనమని ఎమ్మెల్యే, జిల్లా వైసిపి నాయకులు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. నరసన్నపేటలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ పోలీసులపై దాడి ప్రజాస్వామ్యంపై దాడి అని, దీన్ని వైసిపి నాయకులు తీవ్రంగా ఖండిస్తున్నారని అనానరు. పెద్ద ఎత్తున రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు వ్యక్తం చేస్తున్నామని అన్నారు. చంద్రబాబు చర్యపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని, దురాలోచన, దుష్ట సంప్రదాయాన్ని మానుకోవాలని హితవు పలికారు. అనంతరం పేట, బొంతల వీధి, సత్యనారాయణనగర్, కామేశ్వర నగర్‌ల్లో ఇంటింటికీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ముద్రించి పోస్టలను అందజేశారు. కార్యక్రమంలో భాగంగా ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎంపిపి ఆరంగి మురళీధర్, చింతు రామారావు, కోరాడ చంద్రభూషణ్ గుప్తా, బూరెళ్ల శంకర్, బొబ్బాది ఈశ్వరరావు, సాయి ప్రసాద్ పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణదాస్

కారుణ్య నియామక పత్రాలు అందజేత


నియామకపు పత్రాన్ని అందజేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

శ్రీకాకుళం అర్బన్ : ప్రభుత్వ ఉద్యోగిగా నిబద్ధత, అంకిత భావంతో విధులు నిర్వహించి మంచి పేరు తెచ్చుకోవాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నలుగురికి కారుణ్య నియామక పత్రాలను సోమవారం అందజేశారు. జిల్లాలో సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు వివిధ అనారోగ్య కారణాలతో సర్వీసులో ఉంటూ మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులకు సచివాలయాల్లో వివిధ శాఖల్లో కారుణ్య ఉద్యోగ నియామకాలు చేపట్టామని తెలిపారు. వ్యాప్తంగా ప్రభుత్వ శాఖల్లో పని చేస్తూ కోవిడ్ వల్ల మృతి చెందిన ఉద్యోగుల వివరాలు తెలపాలని ఆయా శాఖాధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డిఆర్ఓ మురళీకృష్ణ, జెడ్‌పి సిఇఒ వెంకట్‌రామన్, డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్ పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

కోటబొమ్మాళి: మండలంలోని దుప్పిలపాడు సమీపంలో కొండ వద్ద పేకాట ఆడుతున్న శిబిరంపై సోమవారం దాడి చేసి జూదరులను అరెస్టు చేశామని ఎస్ఐ షేక్ మహమ్మద్ అలీ తెలిపారు. కొద్ది రోజులుగా పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేశామని అన్నారు. వారి వద్ద నుంచి రూ.50 వేలు నగదు స్వాధీనం చేసుకుని ఏడుగురు జూదరులను అరెస్టు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

పొందూరు: మండలంలోని ధర్మపురంలో పేకాట శిబిరంపై దాడిచేసి 8 మంది జూదురులను పట్టుకున్నట్లు ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు. పట్టుబడిన జూదురుల వద్ద గల రూ.5,083లను స్వాధీం చేసుకుని కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు.


ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

'నాసా'లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

శ్రీకాకుళం అర్బన్ : నాసా పోటీల్లో నగరంలోని మహాలక్ష్మినగర్ కాలనీ శ్రీచైతన్య విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతి గెలుచుకున్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని శ్రీచైతన్య పాఠశాలల్లో నాసా సెటిల్‌మెంట్ అవార్డుల కార్యక్రమం సోమవారం నిర్వహించారు. గతేడాది జాతీయస్థాయి పాఠశాలలో నిర్వహించిన అంతర్ సృష్టి ట్రై కోమా, నిర్వహణ స్పేస్ కాలనీ ప్రాజెక్టుల్లో 48 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అందులో 13 మందికి జీతాయ స్థాయిలో అవార్డులు దక్కాయని పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్.రాంప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జిల్లాల ఎజిఎం ఎం.వి.సురేష్, ఉత్తరాంధ్ర జిల్లాల కో-ఆర్డినేటర్ ఎ.బాలరాజు, జిల్లా రీజియన్ ఇన్‌ఛార్జి ఎస్.రామినాయుడు, జోనల్ అకడమిక్ డీన్ పి.మోహన్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ వి.ఇంద్రమౌళి, అకడమిక్ డీన్ సిహెచ్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్

జలుమూరు: వివిధ కారణాలతో ఖాళీ అయిన కొమనాపల్లి-1, జోణంకి-1 పంచాయతీల్లోని రెండు వార్డు సభ్యులకు మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు ఎంపిడిఒ ఎల్.వి.అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. వీటికి ఈ నెల 19వ తేదీన ఎన్నికలు నిర్వహించి అదే రోజున కౌంటింగ్ అనంతరం గెలుపొందిన అభ్యర్థులను ప్రకటిస్తామని అన్నారు. 10లోగా నామినేషన్ పత్రాలను దాఖలు చేయాలన్నారు. 11న స్క్రూటినీ, 12న అప్పీల్, 13న అప్పీళ్లపై పరిశీలన, నామినేషన్ల ఉపసంహరణకు 14న అని పేర్కొన్నారు. 14న సాయంత్రం మూడు గంటల తర్వాత పోటీలో ఉన్న అభ్యర్థుల వివరాలు ప్రకటిస్తామన్నారు. 19న ఎన్నిక, మధ్యాహ్నం రెండు గంటలకు కౌంటింగ్, కౌంటింగ్ అనంతరం గెలుపొందిన అభ్యర్థుల వివరాలు ప్రకటన ఉంటుందని చెప్పారు. అదే రోజున ఉపసర్పంచ్ ఎన్నిక ఉంటుందన్నారు. ఎక్కడైనా రీపోలింగ్ ఉన్నట్లయితే 20న నిర్వహిస్తామని తెలిపారు.

ఆమదాలవలస : మండలంలోని అక్కివరం సర్పంచ్, కలివరం పంచాయతీలోని రెండో వార్డు, కొరపాం పంచాయతీలోని నాలుగో వార్డుకు ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసినట్లు ఎంపిడిఒ ఎస్.వాసుదేవరావు తెలిపారు. మంగళవారం నుంచి 10వ తేదీ ఐదు గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తున్నామని అన్నారు.

రేషన్ డీలర్ల నియామకానికి దరఖాస్తులు

జలుమూరు: మండలంలోని వెంకటాపురం, పాగోడు, లింగాలవలస రేషన్ డీలర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తహశీల్దార్ బి.సత్యం ఒక ప్రకటనలో తెలిపారు. లింగాలవలస (ఎస్‌సి జనరల్), పాగోడు (ఒసి ఉమెన్), వెంకటాపురం (ఎస్‌సి ఉమెన్) లకు రిజర్వేషన్ కేటాయించామని పేర్కొన్నారు. 14 లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 16న శ్రీకాకుళం లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాత పరీక్ష ఉంటుం దన్నారు. 19న ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. 18 నుంచి 40 ఏళ్లలోపు ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన వారు అర్హులని అన్నారు.

ప్రలోభాలకు లొంగవద్దు

బూర్జ: విద్యార్థిణులు ప్రలోభాలకు లొంగవద్దని ఎహెచ్‌టియు ఎస్ఐ కేశవరావు సూచించారు. మండలంలోని కొలివలస కెజిబివిలో కెఎస్‌సిఎఫ్, ఎహెచ్‌టియు సంయుక్తంగా సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనవసరమైన విషయాలకు ఆకర్షితులై తమ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. ప్రభుత్వం ఎన్నో పథకాలను అమలు చేస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బాల్య వివాహాలు వల్ల ఎన్నో అనర్థాలు చేసుకుంటున్నాయని వివరించారు. బాల కార్మికులుగా మారడం వల్ల తమ భవిష్యత్ అగమ్య గోచరంగా మారుతుందన్నారు. ఎక్కడైనా విద్యార్థినులు వేధింపులకు గురైతే వెంటనే పలు నంబర్లకు ఫోన్ చేస్తే... తక్షణమే రక్షణ కల్పిస్తామని అన్నారు. చిల్డ్రన్ ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ శ్రీనివాస్ కైలాష్, కెజిబివి సిబ్బంది పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ కేశవరావు

సచివాలయ వ్యవస్థ ఆదర్శం


ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

జి.సిగడాం: సచివాలయాల ద్వారా ప్రజల చెంతకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని, సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని ఆనందపురంలో నూతన సచివాలయ, సంతవురిటిలో రైతు భరోసా కేంద్రం, కృష్ణా పార్కు, ఆరోగ్య కేంద్ర భవనాలను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం జగన్ ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలు ఆయా గ్రామాల పరిధిలోనే వారి సమస్యలు పరిష్కారం అవుతున్నాయన్నారు. రైతులకు సబ్సిడీ కింద విత్తనాలు రైతు భరోసా కేంద్రంలో ఉంటుందని తెలిపారు. ప్రతి 2,500 జనాభాకూ ఒక వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి మీసాల సత్యవతి, మండల ప్రత్యేకాహ్వానితులు మీసాల వెంకటరమణ, జెడ్‌పిటిసి కాయల రమణ, మండల పార్టీ అధ్యక్షులు వెంకటరమణ, సర్పంచ్ చిత్తిరి మంజు, ఎంపిటిసి ప్రతినిధి చిత్తిరి మోహన్, ఎంపిడిఒ కె.నిశ్చెల, తహశీల్దార్ పప్పల వేణుగోపాలరావు, పిఆర్ ఎఇ శ్రీవల్లి, మండల ఎఒ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చేనేత రంగ సంక్షేమానికి కృషి

ప్రజాశక్తి- ఆమదాలవలస

చేనేత రంగ సంక్షేమాన్ని ప్రభుత్వం కృషి చేస్తుందని, సొంత మగ్గం ఉన్న ప్రతి కుటుంబానికీ ఏటా రూ.24 వేలు ఆర్థికసాయం అందిస్తుందని వైఎస్ఆర్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా మండలంలోని శ్రీనివాసాచార్యులపేటలో గ్రామ సంఘం ప్రెసిడెంట్ పి.సంధ్య అధ్యక్షతన సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మగ్గానికి మళ్లీ మహర్దశ వస్తుందని అన్నారు. నాలుగేళ్లుగా 135 కుటుంబాలకు వైఎస్ఆర్ నేతన్న నేస్తం పథకం ఆర్థికసాయం నేరుగా వారి ఖాతాలకే అందించినట్లు తెలిపారు. శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం కృషి ఫలితంగా చేనేత రంగంలో ఉన్న వారందరికీ క్లస్టర్స్ ఏర్పాటు చేయించి, అధునాతన శిక్షణలతో పాటు సబ్సిడీపై పరికరాలను ఇప్పించినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో క్లస్టర్ కో-ఆర్డినేటర్లు సుభద్ర, రామప్పడు, చంద్రరావు, రమణ, విఒఎలు సుశీల, లక్ష్మి, వెంకటరత్నం, రోహిణి, హైమావతి పాల్గొన్నారు.


ఆమదాలవలస : అవగాహన కల్పిస్తున్న ఎపిఎం కూర్మారావు

అలరించిన వస్త్రధారణ


నందిగాం : వేషధారణలతో అలరించిన విద్యార్థులు

నందిగాం : జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నేత వస్త్రాలే ధరించాలని కోరుతు లఖిదాసుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకి చెందిన విద్యార్థులు వేషధారణ పలువురుని ఆలరించింది. ప్రధానోపాధ్యాయులు చిలుకు కృష్ణారావు ఆధ్వర్యాన విద్యార్థులు వివిధ వేషధారణలతో చేనేత వస్త్రాలు ధరించి ప్రదర్శన చేపట్టారు. చేనేత వస్త్రాలు, వాటి ఆవశ్యకత, వినియోగంపై వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు బాలక రామారావు, తులసీప్రసాద్, రంకిడి రామారావు, బెందాళం రత్నం, గోవిందరాజు, ప్రియదర్శిని, యాగాటి త్రినాథరావు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి- పొందూరు

విశాఖపట్నంలో మూడు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మండలంలోని గోకర్ణపల్లికి చెందిన కానిస్టేబుల్ కంచరాన విఠల్‌రావు కుటుంబానికి 2013 బ్యాచ్ కానిస్టేబుళ్లు అండగా నిలిచారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గుంటూరు జిల్లాకు చెందిన 2013 బ్యాచ్ సివిల్ కానిస్టేబుళ్ల నుంచి సేకరించిన రూ.లక్ష మృతుడు కానిస్టేబుల్ భార్యకు ఆదివారం అందజేశారు. అలాగే గతంలోనూ శ్రీకాకుళం కానిస్టేబుళ్ల నుంచి రూ.లక్షల, విశాఖపట్నం సిటీ అండ్ రూరల్ పోలీసులు సేకరించిన రూ.2,81,500ు, గుంటూరు నుంచి సేకరించిన రూ.1,30,000 నూ మృతిని కుటుంబ సభ్యులకు అప్పట్లో అందజేసినట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తోటి కానిస్టేబుల్ కుటుంబానికి అండగా నిలిచి తమ మానవత్వాన్ని చాటుకున్న 2013 బ్యాచ్ కానిస్టేబుళ్లను అభినందిస్తున్నారు.

పూర్వ విద్యార్థులు...


నగదును అందజేస్తున్న కానిస్టేబుళ్లు

కొత్తూరు : మండలంలోని కర్లెమ్మ పంచాయతీ నేతాజీ నగర్ కాలనీకి చెందిన సింహాద్రి రామకృష్ణ ఇటీవల మృతి చెందారు. ఈయనకు భార్య ఆకాంక్ష, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య కిడ్నీ వ్యాధితో బాధపడుతుంది. విషయం తెలుసుకున్న 1997-98 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు రూ.62 వేలు వసూలు చేసి సోమవారం అందజేశారు. కార్యక్రమంలో వి.సూర్యనారాయణ, రాజారావు, శంకరరావు, రామచంద్ర, జి.గడ్డెయ్య, గిరిబాబు, రమేష్, కవిత, ధనలక్ష్మి పాల్గొన్నారు.

కుక్కల స్వైరవిహారం

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం పట్టణంలో రాత్రి, పగలు అనే తేడా లేకుండా వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో పట్టణ వాసులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల మున్సిపల్ కౌన్సెల్ సాధారణ సమావేశంలో వార్డు కౌన్సిలర్లు కుక్కల బెడద నుంచి గట్టించాలని కోరారు. కానీ, మున్సిపల్ అధికార యంత్రాంగం ఇప్పటికీ చొరవ తేరుకోలేదు. రథం వీధి, పంజావీధి, బ్రాహ్మణ వీధి, మెయిన్ రోడ్డు, గొల్లవీధి, వి.కె.పేటలో కుక్కల బెడద అధికంగా ఉంటుంది. అధికారులు స్పందించి కుక్కల నియంత్రణకు తక్షణ చర్యలు తీసుకోవాలని పుర వాసులు కోరుతున్నారు.


స్వైరవిహారం చేస్తున్న కుక్కలు

కళాకారులకు అరుదైన అవకాశం

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం శ్రీస్వేచ్ఛా నృత్య తరంగిణి కూచిపూడి భరతనాట్యం, జానపద నాట్య శిక్షణాలయం, నాట్య కళాకారులకు అరుదైన అవకాశం లభించింది. కూచిపూడి విభాగంలో దూరదర్శన్ బి-గ్రేడ్ అడిసాన్ నిర్వహిస్తున్న పోటీలకు 18 ఏళ్లు పైబడిన వారు దరఖాస్తు పంపించాలని కోరారు. జూన్ నెలలో ఎంపికలు నిర్వహించారు. ఈ పోటీలకు శ్రీస్వేచ్ఛా నృత్య తరంగిణి నాట్య గురువు మంగి దివ్య, కర్నం కుమార్ ఎంపికైనట్లు దూరదర్శన్ కూచిపూడి ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ ఆర్.రవీంద్రరావు తెలిపినట్లు అకాడమి చైర్మన్ కె.గోవిందరావు తెలిపారు. ఈ పోటీలు ఆగస్టు 1 నుంచి 31 వరకు నిర్వహించనున్నారు. ఒకొక్కరు నాట్యం అభినయం 15 నిముషాల్లో రెండు సాంప్రదాయ పాటలు ప్రదర్శించాల్సి ఉంటుందని అన్నారు. ఈ పోటీలు దూరదర్శన్ కేంద్రం రామంతపూర్ హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ పోటీలకు ఎంపికైన మంగి దివ్య, కర్నం కుమార్‌లకు అకాడమీ అధ్యక్షులు కె.గోవిందరావు, కోశాధికారి మంగి దాలమ్మ, నాట్య కళాకారులు అభినందనలు తెలియజేశారు.


ఎంపికైన దివ్య, కుమార్

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ఆమదాలవలస : ఈ నెల 8న విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నామని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సత్తారు బయ్యన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఆమదాలవలస రూరల్ రాగోలు సబ్ స్టేషన్ పరిధిలోని కొత్త రోడ్డు ప్రాంతంలో రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నారని అన్నారు. అందుకు విద్యుత్ స్తంభాలు, తీగలు మార్చుట దృష్ట్యా కొత్త రోడ్డు, గోపీనగర్ తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

దువ్వాడ తీరుపై ధ్వజం

ప్రజాశక్తి- నౌపడ

ప్రజలను విభజించి, వారి మధ్య చిచ్చుపెట్టి దాన్ని స్వార్ధానికి వాడుకుంటున్నారని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌పై మూలపేట సర్పంచ్ జీరు బాబూరావు ధ్వజమెత్తారు. నౌపడలో నిర్మిస్తున్న ఆర్అండ్‌ఆర్ కాలనీ శంకుస్థాపనకు తనకు ఆహ్వానించకపోవడంతో సోమవారం నౌపడలో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నిర్మాణానికి భూములు త్యాగం చేసిన నిర్వాసితులకు, తమకు శంకుస్థాపన సమాచారం ఇవ్వలేదని పేర్కొన్నారు. నిర్వాసితుల మాదిరిగానే కాలనీకి భూములు ఇచ్చిన నౌపడ రైతులకు, ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వకుండా సమావేశం పెట్టడం ఏంటి అని ప్రశ్నించారు. ఆర్అండ్‌ఆర్ కాలనీ ఉప్పు నీరు పడుతుండటంతో గ్రామస్తులు వ్యతిరేకించినట్లు తెలిపారు. ఎమ్మెల్సీ తమ గ్రామంలో కొంతమందిని గ్రూపులుగా విభజించి, వారి మధ్య చిచ్చు పెడుతున్నారని విమర్శించారు. ఆదివారం గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ లేకుండానే జీడి మొక్కలకు రూ.2,500 చొప్పున పంపిణీ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పోర్టు నిర్మాణంలో రాజకీయ చేసి వ్యాపారం చేసుకుంటున్నారని మండిపడ్డారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి నిర్వాసితులతో మాట్లాడి ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలని ఉద్దేశంతో భూసేకరణలో ఎంతో కష్టపడ్డామని గుర్తు చేశారు. ఇప్పుడు సర్పంచ్ అవసరం లేదా? అని ప్రశ్నించారు.


బాబూరావు, సర్పంచ్

10న విజయనగరం కలెక్టరేట్ వద్ద ధర్నా


మాట్లాడుతున్న ఈశ్వరరావు

రణస్థలం రూరల్: కేంద్రం నుంచి వస్తున్న పంచాయతీ నిధులను రాష్ట్ర ప్రభుత్వం దుర్వినియోగం చేస్తుందని, దీనికి నిరసనగా పార్లమెంటరీ పరిధిలోని సర్పంచ్‌లతో విజయనగరం కలెక్టరేట్ వద్ద ధర్నా చేపడుతున్నామని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఎచ్చెర్ల నియోజకవర్గ కన్వీనర్ నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఇఆర్) తెలిపారు. ఎచ్చెర్ల నియోజకవర్గ క్యాంప్ కార్యాలయంలో నాలుగు మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, నాయకులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిధుల మళ్లింపుతో పంచాయతీల అభివృద్ధి నిలిచిపోయాయని అన్నారు. అలాగే సర్పంచ్ పదవి ఉత్సవ విగ్రహంగా వైసిపి ప్రభుత్వం మార్చేసిందని మండిపడ్డారు. నిధులు లేక గ్రామంలో అభివృద్ధి పనులు నోచుకోక కుంటుపడిపోతుందన్నారు. ఈ ధర్నాలో నియోజకవర్గంలోని సర్పంచ్‌లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక ఎంపిటిసి టి.సంజీవరావు, సంపతరావు నాగేశ్వరరావు, ఇజ్జాడ శ్రీనివాసరావు, విజ్జపర్తి రఘురామ్, తమ్మినేని గోవిందరావు, మౌళి, గొర్లె శ్రీహరి, పతివాడ పైడినాయుడు, దన్నాన రాజేంద్ర, టోంపల అప్పలరాజు, మీసాల రామకృష్ణ పాల్గొన్నారు.

గద్దర్‌కు నివాళి


పలాస : చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న సభ్యులు

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో విప్లవ గాయకుడు గద్దర్ సంతాపసభ ఉద్దానం సాహితీ సాంస్కృతిక వేదిక సభ్యులు సోమవారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఉద్దానం సాహితి అధ్యక్షులు లండ రుద్రమూర్తి, కార్యదర్శి చిక్కోలు జగదీష్, నిశితసి రాజారావు, కుత్తుం వినోద్, శివజ్యోతి, తెప్పల కృష్ణమూర్తి, బండారి కాళిదాసు, అందాల కోటేశ్వరరావు, సాలిన జోగారావు, గుమ్మిడి సాంబమూర్తి, ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు లోపింటి తేజేశ్వరరావు, ఉర్నాన అప్పలరాజు పాల్గొన్నారు.

తీరనిలోటు

ప్రజా కళాకారుడు గద్దర్ మృతికి ప్రజానాట్య మండలి జిల్లా కమిటీ నాయకులు నెయ్యల చంద్రయ్య, యుటిఎఫ్ నాయకులు బి.ఓంకార్ ఒక ప్రకటనలో ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. కార్మిక, కర్షక కష్టాలు పాట రూపంగా మార్చి గజ్జ కట్టి ప్రదర్శన మొత్తం చైతన్యం నిప్పెదిగా ఉండేదని అన్నారు. ప్రజా పాటలకు జీవం పోచిన గద్దర్ మృతి ఉద్యమాలకు తీరని లోటన్నారు. కార్మిక, కర్షక్, రాజ్యం వచ్చేవరకు గద్దర్ పాటలకు మరణం లేదన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

శ్రీకాకుళం అర్బన్ : ప్రజా గాయకుడు గద్దర్ మృతిపై సాహితీ స్రవంతి జిల్లా కన్వీనర్ కె.శ్రీనివాస్ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. యావత్ జీవితం పీడిత వర్గాల విముక్తికే తన కలాన్ని, గళాన్ని అంకితం చేసిన ప్రజా వాగ్గేయకారుడు గద్దర్ అని పేర్కొన్నారు. గుమ్మడి విఠల్‌రావుగా ఉన్న తన పేరును గద్దర్‌గా మార్చుకుని ప్రజలను జాగృతం చేసేందుకు వేలాది పాటలను ప్రజలకు అందించారన్నారు. ఆయన మృతి అభ్యుదయ ప్రగతిశీల ప్రజాస్వామ్య ఉద్యమాలకు తీరని లోటని, ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.


అచ్చెన్నాయుడుతో టిడిపి నాయకులు

అచ్చెన్నను కలిసిన నాయకులు

కోటబొమ్మాళి: వచ్చే ఎన్నికల్లో టిడిపి గెలుపునకు ఇప్పటి నుంచే కార్యకర్తలు కృషి చేయాలని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు. స్థానిక టిడిపి కార్యాలయంలో అచ్చెన్న ఉన్నారన్న సమాచారం అందుకున్న నాయకులు, కార్యకర్తలు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామాల్లో పర్యటించి ప్రభుత్వం వైఫల్యాలను ఎండగట్టాలన్నారు. రాష్ట్రంలో వైసిపి అరాచక పాలన చేస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో కోరాడ గోవింద్, చిన్న గోవింద్, బోయిన ద్వారక, బోయిన వెంకటేశ్వరరావు, మెకానిక్ శ్రీను పాల్గొన్నారు.


విద్యార్థినులతో మాట్లాడుతున్న సన్యాసినాయుడు

గిరిజన వసతిగృహం సందర్శన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వసతిగృహాల్లో చదువుతున్న విద్యార్థినులు క్రమశిక్షణతో మెలగడంతో పాటు పట్టుదలతో చదువుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు పేర్కొన్నారు. నగరంలోని మహిళా కళాశాల ప్రాంగణంలో ఉన్న గిరిజన బాలికల వసతిగృహాన్ని సోమవారం సందర్శించారు. అక్కడున్న విద్యార్థినిలతో మాట్లాడుతూ వసతులు గురించి అడిగి తెలుసుకున్నారు. భోజన సౌకర్యంతో పాటు ర్యాగింగ్ వంటి దురాగతాలపై ఆరా తీశారు. విద్యార్థుల్లో సీనియర్లు, జూనియర్లు అన్న భావన వదిలి అక్కాచెల్లెళ్లుగా మెలగాలన్నారు. స్నేహపూరిత వాతావరణం ఉంటేనే క్రమ శిక్షణ అలవడుతుందన్నారు. కార్యక్రమంలో న్యాయవాది గేదెల ఇందిరాప్రసాద్, హాస్టల్ వెల్ఫేర్ అధికారి ప్రమీల పాల్గొన్నారు.

అనాథలకు అల్పాహారం

రణస్థలం : వైసిపి రాష్ట్ర విద్యార్థి విధానం అధ్యక్షులు పానుగంటి చైతన్య సోమవారం పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. ఈయన పుట్టిన రోజు సందర్భంగా జిల్లా కేంద్రంలోని శాంతా కళ్యాణ్ అనురాగ నిలయం, అనాథ శరణాలయం (బాల బాలికలు), నాగజ్యోతి ఆనంద నిలయం, వృద్ధాశ్రమంలో ఉన్న చిన్నారులకు, వృద్ధులకు శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల విద్యార్థి విభాగం, జోనల్ ఇన్‌ఛార్జి వడ్డాది పాణి కుమార్ అల్పాహారం ఏర్పాటు చేసి ఆయనే స్వయంగా వడ్డించారు.

స్పందనకు 108 వినతులు

ప్రజాశక్తి- సీతంపేట

సీతంపేట ఐటిడిఎలో సోమవారం పిఒ కల్పనాకుమారి నిర్వహించిన స్పందనకు 108 వినతులు వచ్చాయి. బడుగూడలో మినీ అంగన్వాడి కేంద్రం ఏర్పాటు చేయాలని, దిగువ మల్లెల గూడకు చెందిన సవర చిన్న బాబు ఏదైనా ఉపాధి కల్పించాలని కోరారు. ఎర్రన్న గూడకు చెందిన సవర మల్లేష్ భాష వాలంటరీ నియమించాలని, పాంద్రకు చెందిన జమ్మి పవర్ విడర్ మంజూరు చేయాలని కోరారు. ముగనగూడకు చెందిన నిమ్మల మహేష్ ఐటిఐలో సీటు ఇప్పించాలని, కొండివలసకు చెందిన రామకుమారి వితంతు పెన్షన్ ఇప్పించాలని వినతులిచ్చారు. ఈ స్పందన కార్యక్రమంలో ఎపిఒ రోషి రెడ్డి, డిడి శ్రీనివాసరావు, ట్రైబల్ వెల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్ సింహాచలం, డిప్యూటీ డిఎంహెచ్ ఒ చిరంజీవి, డిప్యూటీ డిఇఒ లిల్లీరాణి, సిడిపిఒ రంగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

ప్రజాశక్తి- సీతంపేట

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. సోమవారం గిరిజన గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. మండలంలో కడగండి సచివాలయ పరిధిలో గల ఒంద్రుజోల, భుచెంద్రి, సంతవలస, కడగండి వలస, కడగండి, పెద్దవంగర, పెద్దవంగర గూడ గ్రామాలలో ఉన్న అన్ని ఇళ్లకు వెళ్లి ఆయా కుటుంబాలకు ఈ నాలుగేళ్లలో వైసిపి ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాలను వివరించారు.మరోసారి తనతో పాటు సిఎం జగన్మోహన్రెడ్డిని కూడా ఆశీర్వాదించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పిటిసి సవర లక్ష్మి, స్థానిక సర్పంచ్ కొండగొర్రి కుమారి, ఎంపిటిసి సవర శాంతి, నాయకులు సవర రాము, కొండగొర్రి చంద్రరావు, సవర తిరుపతి రావు, సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు, అధికారులు పాల్గొన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడి

ప్రజాశక్తి- ఆమదాలవలస

వరి పంట సాగులో నారు దశ నుంచి కోత దశ వరకు పంటలో సమగ్ర సస్య రక్షణ పద్ధతులను పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నక్క చిరంజీవి అన్నారు. మండలంలోని చేపేనపేటలో రైతులతో వరి నారుమడిలో నారు బీజమృతంలో శుద్ధి చేయించి కొసలు తుంచి వరుస క్రమంలో నాట్లు వేయించారు. ఈ విధంగా ప్రకృతి వ్యవసాయంలో వరి పంటలో రాజీలేని సూత్రాలు పాటించినట్లయితే పెట్టుబడులు తగ్గి అధిక దిగుబడులు వస్తాయని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది క్షేత్రస్థాయిలో రైతులకు అందుబాటులో ఉండి వరి పంటలో మెరుగైన పద్ధతులను వివరిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తిరుపతిరావు, లక్ష్మి, కృష్ణవేణి, జానకిరామ్ పాల్గొన్నారు.

రణస్థలం రూరల్: వరి నారును శుద్ధి చేస్తే పంట దిగుబడి వస్తుందని ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌ఛార్జి గంట్యాడ ఏసుబాబు రైతులకు సూచించారు. మండలంలోని రావాడ, లంకపేట గ్రామాల్లో సామూహికంగా బీజామృతంతో వరి నారును సోమవారం శుద్ధి చేసే విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ విధంగా చేయడం వల్ల వైరస్ బ్యాక్టీరియా తెగుళ్లను నివారించవచ్చని అన్నారు. వరి నారు కొసలు త్రుంచడం వల్ల పంటకు గుడ్ల దశలో ఉన్న ఆకు అడుగు భాగాన కంటికి కనిపించని, గుడ్లను నివారించుకోవచ్చన్నారు. వరి నాట్లను వరుస పద్ధతిలో వేయటం వల్ల తూర్పు, పడమటి నుంచి వచ్చే సూర్యరశ్మి కిరణాల ద్వారా దోమపోటు పురుగులను తెగులను నివారించవచ్చునన్నారు. గట్ల పైన కంది, బంతి, బెండ చిక్కుడు వంగ వేయడం వల్ల పురుగులను వాటిపై వాలి పంటపై ఎటువంటి నష్టం వాటిల్లదన్నారు. కార్యక్రమంలో ఐసిఆర్‌పి సూర్యం, రమణమ్మ, సుజాత పాల్గొన్నారు.


రణస్థలం రూరల్ : వరి నారును శుద్ధి చేస్తున్న రైతులు

వైద్య శిబిరాలకు స్పందన


నందిగాం : రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

నందిగాం: మండలంలోని స్థానిక పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో రాగోలు జెమ్స్ ఆస్పత్రి సౌజన్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ముందుగా ఈ శిబిరాన్ని సర్పంచ్ జె.రమణమ్మ ప్రారంభించారు. వైద్యులు పూజిత హిమశ్రీ, మౌనికలు 241 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న సందర్భంగా సీజన్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని అన్నారు. వేడి వేడి ఆహారాలను తీసుకోవాలని సూచించారు. జ్వరం వచ్చిన వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో జెసిఎస్ కన్వీనర్ జె.జయరాం, వైసిపి టెక్కలి నాయకులు చింతాడ గణపతిరావు, ఎ.లోకనాథం పాల్గొన్నారు.

ఆమదాలవలస : మండలంలోని కొత్తవలసలో సువారి గాంధీ టీం డాక్టర్ రెడ్డి లేబొరేటరీస్ ఆధ్వర్యాన ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజలు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. 200 మంది రోగులకు రక్త పరీక్షలు, ఇతర వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బొడ్డేపల్లి మన్మథ, రాజేష్ పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న తిలక్

అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి- నందిగాం

గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు పెద్దఎత్తున చేపడుతున్నామని కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ అన్నారు. మండలంలోని హరిదాసుపురంలో మండల పరిషత్ నిధులతో సిసి రోడ్డు నిర్మాణానికి ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి, సర్పంచ్ కణితి నారాయణమూర్తి, ఎంపిటిసి ప్రతినిధి కణితి రామచంద్రుడుతో కలిసి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం జగన్మోహన్‌రెడ్డి గ్రామాల్లో పూర్తిస్థాయి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని లక్ష్యంతో సచివాలయ వ్యవస్థ ద్వారా అన్ని భవనాలు నిర్మిస్తున్నామని అన్నారు. సిసి రోడ్లు, తాగునీటి సౌకర్యం కల్పనతో పాటు గ్రామాల్లో అభివృద్ధి చేపడుతున్నామని అన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు చిన్ని జోగారావు యాదవ్, ఎంపిటిసి మాజీ సభ్యులు కణితి కేశవరావు, భాస్కరరావు, వెంకటరావు, క్రాంతి, కేశవరావు పాల్గొన్నారు.

వైసిపితోనే ఒబిసిలకు న్యాయం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు శిష్టకరణ, అరవల, సొండి, కళింగ వైశ్య తరగతులపై చూపిస్తున్న కపట ప్రేమను కట్టి పెట్టాలని వైసిపి యువజన విభాగం అధ్యక్షులు ఎం.వి.స్వరూప్ అన్నారు. నగరంలోని జిల్లా వైసిపి కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. వారిని ఒబిసిలో చేర్పించే దిశగా 2020లో సిఎం జగన్మోహనరెడ్డి సమగ్ర నివేదికను కేంద్ర మంత్రులకు పంపించారని అనానరు. ఇదే విషయాన్ని ఎంపీ కూడా తెలియపరిచామని అన్నారు. రాజకీయ లబ్ధి కోసం తమ పార్టీకి చెందిన కొందరు సంఘ నాయకులను తీసుకెళ్లి ఎన్‌సిబిసి ఎదుట పెట్టడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సమావేశంలో రత్నాల నర్సింహమూర్తి, నక్క రామరాజు, గుండ హరీష్, ద్వారపు అజిత్, పిల్లల రామకృష్ణ, కర్నేని హరి, సత్తిరాజు, మట్ట నగేష్ రాజు, తిరగడి లక్ష్మణ కుమార్, కనపల తేజ, సీపాన రామారావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న స్వరూప్


పాడైన ప్లాట్‌ఫారం

ప్లాట్‌ఫారం నిర్మించరూ...

ప్రజాశక్తి- ఆమదాలవలస

పురపాలక సంఘంలోని 6వ వార్డు పరిధి కె.మన్నయ్యపేటలోని తాగునీటి బోరు ప్లాట్ ఫారాన్ని బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు. పలుమార్లు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని వాపోతున్నారు. చందాలు వేసుకొని బాగు చేసుకుంటామంటే అధికారులు అనుమతి ఇవ్వడం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలందరికీ ఈ బోరు నీరే జీవనాధారమని వాపోయారు. శివారు వార్డు కావడంతో రెండు రోజులకొకసారి మున్సిపల్ వాటర్ ట్యాంకు వస్తుందని తెలిపారు.

ఫ్లాట్‌ఫారం పూర్తిగా పాడవడంతో నీటిని తెచ్చుకుంనేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఫ్లాట్‌ఫామ్‌ను మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఖరీఫ్ 2023-24 పంట కాలానికి సంబంధించి ఈ-క్రాప్ నమోదు ప్రారంభించామని, మండలంలోని రైతులందరూ ఈ-క్రాప్‌లో నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారి మెట్ట మోహనరావు తెలిపారు. మండలంలోని శ్రీనివాసచార్యులపేట రైతు భరోసా కేంద్రం పరిధిలోని అక్కులపేట, శ్రీనివాసాచార్యులపేట గ్రామాల్లో ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు ఈ-క్రాప్ నమోదు చేసుకోవడం వల్ల సున్నా వడ్డీ పంట రుణాలు, పంటల బీమా, పంటల నష్ట పరిహారం, మద్దతు ధరకే పంటల అమ్మకం చేసుకోవచ్చునని తెలిపారు. రైతులందరూ వారికి సంబంధించిన రైతు భరోసా కేంద్రాల్లో ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విలేజ్ హార్టీ కల్చరల్ అసిస్టెంట్ పి.జాగీశ్వరరావు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : ఈ-పంట నమోదు ఆర్‌బికెల్లో ప్రారంభమైందని, రైతులు ఈ-పంట నమోదు చేసుకోవాలని మండలం ఎఒ దానకర్ణుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ-పంట నమోదు మరింత పకడ్బందీగా నిర్వహిస్తామని అన్నారు.


అవార్డు అందుకుంటున్న అప్పారావు

లయన్స్ క్లబ్‌కు ఐదు అవార్డులు

ప్రజాశక్తి- పలాస

విశాఖపట్నం గ్రీన్వేరీ పార్కు హోటలలో ఆదివారం రాత్రి నిర్వహించిన అవార్డుల ప్రదానంలో పలాస-కాశీబుగ్గ లయన్స్‌కు ఐదు అవార్డులు అందజేశారు. ఈ అవార్డులను నెమలిపురి అప్పారావు క్లబ్ తరుపున స్వీకరించారు. కణితీస్ ఐటిఐలో నిర్మాణంలో ఉన్న హాస్టల్ శాశ్వత ప్రాజెక్టుకు ఒకటి, ఏప్రిల్‌లో నిర్వహించిన మెంబర్‌షిప్ ఒకటి, రక్త శిబిరాలకు ఒకటి, సెక్రటరీగా తన విధులు నిర్వహించినందుకు ఒకటి, ఎంజెఎఫ్ చేరినందుకు లయన్ శారద రాజేష్ దేవరకొండకు ఒకటి అవార్డులు అందజేసినట్లు తెలిపారు. ఈ అవార్డులు అందుకున్న మిగతా క్లబ్ లయన్ మెంబర్స్ అభినందనలు తెలిపారు.

రైస్‌మిల్లు యజమానులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి- పర్లాకిమిడి

రైస్ మిల్లు యజమానులు రైతులను మోసం చేస్తున్నారని, యజమానులపై చర్యలు తీసుకోవాలని గజపతి జిల్లా రైతు కూలీ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి రొక్కం లోకనాథం డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందనలో కలెక్టర్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. గుమ్మా, గుసాని, కాశీనగర్ సమితుల్లో రైస్ మిల్లు యజమానులు రైతులను విపరీతంగా దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. ప్రతి 80 కేజీలు ధాన్యం బస్తాకు రూ.32 అదనంగా వసూలు చేస్తున్నారని అన్నారు. ప్రతి బస్తాకూ రెండు నుంచి ఎనిమిది కేజీల వరకు తరుగు, తేమ, తొక్కు పేరుతో మినహాయించి లెక్కిస్తున్నారని అన్నారు. ఆన్లైన్ టోకెన్ రైతుల పంటకు సరిపడినట్లు రావడం లేదని వివరించారు.

మహిళా అభివృద్ధి టిడిపితోనే సాధ్యం

ప్రజాశక్తి- బూర్జ

టిడిపి హయాంలోనే మహిళాభివృద్ధి సాధ్యమని టిడిపి సీనియర్ నాయకులు కూన ప్రమీల అన్నారు. మండలంలోని వైకుంఠపురంలో టిడిపి మహిళా శక్తి కార్యక్రమంలో సోమవారం పాల్గొని మాట్లాడారు. డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేసి మహిళా అభివృద్ధికి మాజీ సిఎం చంద్రబాబు కృషి చేశారని అన్నారు. టిడిపి ప్రకటించిన మేనిఫెస్టోతో వైసిపిలో వణుకు మొదలైందన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి పోస్టర్లను అందజేశారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు వావలి పల్లి రాంజీ, లంక జగన్నాథంనాయుడు, పి.ప్రభాకరరావు, గోవిందరావు, గోపి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సాయిరాం

గ్రామ సంఘాల బలోపేతం

మెళియాపుట్టి : గ్రామ సంఘాలను బలోపేతం చేయాలని స్త్రీనిధి మేనేజర్ సాయిరాం అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఎపిఎం ఎ.లలిత ఆధ్వర్యాన విఒఎలకు ఫైనాన్స్ మేనేజ్‌మెంట్‌పై సోమవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి మహిళలనూ ఆర్థికంగా బలోపేతం చేయడమే మన లక్ష్యమని అన్నారు. క్షేత్రస్థాయిలో ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రభుత్వం అందించే ప్రతి రుణాన్నీ క్షేత్రస్థాయిలో మహిళలు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. ప్రతి రికార్డు నిర్వహణా సక్రమంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో స్త్రీనిధి ఎంజిఎం సత్యనారాయణ, ఎసి సుబ్బయ్య నాయుడు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.


ధ్రువపత్రాన్ని అందజేస్తున్న స్వరూప్ కుమార్

ప్రతిభా పరీక్షకు స్పందన

ఇచ్ఛాపురం : స్థానిక ఆదిత్య జూనియర్ కళాశాలలో, రవీంద్ర భారతి విద్యా సంస్థలో జెఎసి ఆధ్వరాన నేషనల్ లెవెల్ ప్రతిభా పరీక్షలు సోమవారం నిర్వహించారు. ఈ పరీక్షకు 9 నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న 180 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులుక జెసిఐ జాతీయ స్థాయిలో మొదటి బహుమతిగా రూ.40 వేలు, రెండో బహుమతిగా రూ.20, మూడో బహుమతిగా రూ.పది వేలు, జోన్ లెవెల్‌లో అర్హత సాధించిన విద్యార్థులకు మొదటి బహుమతి రూ.7,500, రెండో బహుమతి రూ.5 వేలు, మూడో బహుమతి రూ.3 వేలు చొప్పున అందిస్తారని స్వరూప్ కుమార్ తెలిపారు. అనంతరం విద్యార్థులకు ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జెసిఐ మాజీ అధ్యక్షులు జె.డిలీసు, ఆదిత్య కళాశాల యాజమాన్యం రమణ పాల్గొన్నారు.

ఉద్యమంలా మొక్కలు నాటాలి

రణస్థలం: వాతావరణ మార్పుల నుంచి పర్యావరణాన్ని ఉపశమింపచేయడానికి అందరం ఒక్కటై ఉద్యమంలా మొక్కలు నాటాలని హరిత సమగ్ర గ్రామీణాభివృద్ధి సంస్థ కన్వీనర్ ఆర్.హరిబాబు పిలుపునిచ్చారు. ప్రతిఒక్కరూ తమ పుట్టిన రోజులు ఇతర ప్రత్యేక సందర్భాల్లో కేక్ కట్ చేసే సంస్కృతికి బదులు కనీసం పది మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా మండలంలోని సంచాంలో సర్పంచ్ రెడ్డి రాము అధ్యక్షతన హరిత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యుడు కెల్ల శ్రీను పుట్టిన రోజు సందర్భంగా వారి ఆర్థిక సాయంతో గ్రామం నడిబొడ్డున చెరువుగట్టు వెంబడి వంద మొక్కలు సోమవారం నాటారు. కార్యక్రమంలో రెడ్డి ఆనంద్, మీసాల రాము (పండు) పాల్గొన్నారు.


మొక్కలను నాటుతున్న సభ్యులు